

కేజీహెచ్‌లో ఆధునిక సత్రం రెడీ
కేజీహెచ్‌లో రూ.50 లక్షలతో ఆధునిక సత్రం నిర్మించారు. దాన్ని మంగళవారం మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారు. 8లో



మనబడి-మన బాధ్యత..!
విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. నాడు-నేడుతో పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది. 8లో



తొలివిడత చందనం సమర్పణ
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం తెల్లవారుజామున తొలివిడత చందనం శాస్త్రోక్తంగా సమర్పించారు. 8లో

భూగర్భ జలాల ఊరట



- ఆశాజనకంగా భూగర్భ జలాలు
- చుక్కవానిపాలెంలో పైపైకి..
- అక్కడ 3 మీటర్లలోపే నీటి లభ్యత
- ఎండాడలో అట్టడుక్కి..
- ఆ ప్రాంతంలో 19.35 మీటర్ల లోతులో నీటిమట్టం
- మండుటెండల్లోనూ అడుగంటని నీరు

సాక్షి, విశాఖపట్నం: ఎండలు మండుతున్న వేళ విశాఖ జిల్లాలోని భూగర్భ జలాలు ఊరట నిస్తున్నాయి. ఇవి అందుబాటులో ఉంటూ జనానికి ఉపశమనం కలిగిస్తున్నాయి. సాధారణంగా వేసవిలో భూగర్భ జలాలు అడుగంటుతుంటాయి. తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ ప్రస్తుతం ఈ ఏడాది సమ్మర్‌లో ఆ పరిస్థితి లేదు. నీటి మట్టాలు ఆశాజనకంగానే ఉంటున్నాయి. భూగర్భ జల వనరులు, జలగణన శాఖ తరచూ నీటి మట్టాలను పరిశీలిస్తుంది. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పీజోమీటర్ల ద్వారా వాటి స్థాయిలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటుంది. భూగర్భ శాఖ జిల్లాలో నమోదు చేసిన వివరాల ప్రకారం మార్చి ఆఖరి వరకు భీమిలి మండలం చుక్కవానిపాలెంలో భూగర్భ జలాలు అత్యంత పైన అంటే మూడు మీటర్లకంటే తక్కువ లోతులోనే లభ్యమవుతున్నాయి. ఎండాడ ప్రాంతంలో అత్యంత దిగువన అంటే 19.35 మీటర్ల లోతు వరకు లభ్యం కావడం లేదు. 0-3 మీటర్ల మధ్య చుక్కవానిపాలెంతో పాటు చిప్పాడ, పాలవలస, నరవ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే 3-10 మీటర్ల మధ్య నీటి లభ్యత పందలపాక, శొంఠ్యాం, వెల్లంకి, భీమిలి, నగరంపాలెం, అగనంపూడి, బీహెచ్‌పీవీ, గొల్లలపాలెం, గోపాలపట్నం, అనంతవరం, ఐనాడ, పాంద్రంగి, టి.దేవాడ, స్టీల్‌ప్లాంట్, అప్పుఘర్, విశాలాక్షినగర్, పాండురంగాపురం, మధురవాడ, మారికవలస, తాటిచెట్లపాలెం ప్రాంతాలున్నాయి. కణితి కాలనీ, పెందుర్తి, ఆరిలోవ, పెద్ద రుషికొండ, శివాజీపాలెం, వైఎస్సార్ పార్కు ప్రాంతాలు 10-20 మీటర్ల లోతులో నీటిమట్టాలున్నాయి.

హెచ్చుతగ్గులు ఇలా..
మార్చి నెలలో విశాఖ జిల్లాలో సగటు నీటిమట్టం 7.48 మీటర్లుగా ఉంది. గత ఏడాది మార్చిలో 6.82 మీటర్లలో ఉండేది. గత మార్చితో పోల్చుకుంటే స్వల్పంగా 0.66 మీటర్ల దిగువకు వెళ్లినట్టయింది. గత సంవత్సరం మార్చితో భూగర్భ జలాల పరిస్థితిని పరిశీలిస్తే మొత్తం 31 పీజోమీటర్లకు గాను 14 చోట్ల పెరగ్గా, 17 చోట్ల దిగువకు వెళ్లాయి. వీటిలో శొంఠ్యాం, వెల్లంకి, భీమిలి, చుక్కవానిపాలెం, నగరంపాలెం, గొల్లలపాలెం, కణితి కాలనీ, పాంద్రంగి, పాలవలస, టి.దేవాడ, నరవ, పెందుర్తి, స్టీల్‌ప్లాంట్, మారికవలస ప్రాంతాల్లో నీటిమట్టాల స్థాయి పెరుగుదల కనిపించింది. అలాగే పందలపాక, చిప్పాడ, అగనంపూడి, బీహెచ్‌పీవీ, గోపాలపట్నం, అనంతవరం, ఐనాడ, ఏపీటీడీసీ, ఆరిలోవ, బీవీకే కాలేజీ, యోగా విలేజీ, పెద్ద రుషికొండ, ఎండాడ, మధురవాడ, ఏపీఎస్ఐడీసీ, శివాజీపాలెం, వైఎస్సార్ పార్క్ ప్రాంతాల్లో భూగర్భ జలాలు దిగువకు వెళ్లాయి. జిల్లా మొత్తమ్మీద 20 మీటర్లకంటే దిగువన నీటిమట్టాలున్న ప్రాంతాలు ఒక్కటీ లేకపోవడం విశేషం!



పీజోమీటరులో నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సగటు భూగర్భ జలాల లభ్యత మండలాలు

3.01-8 మీటర్లు
ఆనందపురం, భీమిలి, గాజువాక, ములగాడ, పద్మనాభం, పెందుర్తి, గోపాలపట్నం, పెదగంట్యాడ

8.01-20 మీటర్లు
మహారాణిపేట, సీతమ్మధార విశాఖపట్నం రూరల్

భూగర్భ జలాల సంరక్షణ అవసరం



భూగర్భ జలాలనూ అందరూ బాధ్యతగా సంరక్షించుకోవాలి. వర్షం నీరు వృథాగా పోకుండా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు వంటి వాటిని ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల వేసవిలో భూగర్భ జలాలు అందుబాటులో ఉంటూ నీటి ఎద్దడికి ఆస్కారం ఉండదు. ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఆశాజనకంగా ఉంది.
– లక్ష్మణరావు, జిల్లా భూగర్భ జల శాఖాధికారి

పంచాయతీల్లో 'ఉత్తమ' స్థానం!

- రాష్ట్ర స్థాయిలో నాలుగు అవార్డులు
- ప్రత్యేకత చాటుకున్న ఉమ్మడి విశాఖ



జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తికి అవార్డులను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తమ పంచాయతీల జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు విశిష్ట స్థానం దక్కింది. వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి అవార్డులను దక్కించుకుని ప్రత్యేకతను చాటుకుంది. పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, చైల్డ్ ఫ్రెండ్లీ, సమృద్ధిగా నీరు, పచ్చదనం-పరిశుభ్రత, స్వయం సమృద్ధి, సాంఘిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వకం అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఆయా పంచాయతీల ప్రతిభ ఆధారంగా ఈ అవార్డుల ఎంపిక జరిగింది. ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో నాలుగు అవార్డులు దక్కాయి. అనకాపల్లి జిల్లాకు రెండు, విశాఖ, అల్లూరి జిల్లాకు ఒక్కొక్కటి చొప్పున సాధించాయి. నిర్దేశిత వంద మార్కులకు గాను 98-100 వరకు సాధించి ఈ అవార్డులను పొందాయి. అలాగే ఒక్కో కేటగిరీలో తొమ్మిది చొప్పున ఉమ్మడి విశాఖ జిల్లాలో 27 పంచాయతీలకు అవార్డులు అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఐదు, అనకాపల్లి జిల్లాకు 20, విశాఖ జిల్లాకు రెండు చొప్పున అవార్డులు దక్కాయి. భీమిలి మండలం నగరపాలెం పంచాయతీకి సుపరిపాలన విభాగంలో ప్రథమ స్థాయి, మహిళా స్నేహపూర్వక విభాగంలో ద్వితీయ స్థాయి అవార్డులు లభించాయి.

జిల్లా స్థాయి అవార్డుల ప్రదానం
మహారాణిపేట: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో తొమ్మిది అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 27 పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అవార్డులు అందజేశారు. జిల్లా పరిషత్ ముఖ్యనిర్వహణాధికారి శ్రీరామ్మూర్తి, ఎంపీడీవోలకు ఈ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా జేసీ పంచాయతీరాజ్ ఉద్యోగులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

అందరి సహకారంతో పురస్కారం



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ ఛాయాగౌతమి

తగరపువలస: అందరి సహకారంతోనే టి.నగరపాలెం పంచాయతీకి రాష్ట్ర స్థాయి పురస్కారం దక్కిందని సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి తెలిపారు. సోమవారం ఆమె విజయవాడలో జరిగిన జాతీయ పంచాయతీ దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అవార్డును భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ తరఫున అందుకున్నారు. గుడ్ గవర్నెన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించడం తమ పంచాయతీకి గర్వకారణమన్నారు. తమ సచివాలయం సిబ్బంది సహకారంతో ప్రజలకు అవసరమైన అన్నిసేవలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, సచివాలయ సిబ్బందికి ప్రజలకు అభినందనలు తెలిపారు.

త్వరలోనే సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవో

- నిజరూపదర్శన భాగ్యంతో సామాన్య భక్తుల సంతృప్తి
- చందనోత్సవానికి సహకరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్, పోలీస్ కమిషనర్



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ

సాక్షి, విశాఖపట్నం : త్వరలోనే సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవోని నియమిస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ 2.20 లక్షల మంది భక్తులు రావడం కారణంగా కొంతమేర అసౌకర్యం కలిగిందన్నారు. అయినా ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. తెల్లవారు జామున 4 నుంచి 6.30 గంటల మధ్యలో ఎలాంటి ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా దర్శనాలు జరిగాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడం వల్ల కాస్తా గందరగోళ పరిస్థితులు నెలకొన్నా.. కొద్ది గంటల్లోనే పోలీస్ సిబ్బంది.. పరిస్థితులను చక్కదిద్దారని వివరించారు. ఆలయం వెలుపల భక్తుల రద్దీ గమనించిన కలెక్టర్ డా.మల్లికార్జున ఆలయం లోపల ఉన్న భక్తులకు దర్శనం తొందరగా కల్పించి బయటకు పంపించే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారన్నారు. క్యూలైన్లలో భక్తులకు చల్లని మజ్జిగ, మంచినీరు, బిస్కట్లు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువ మందికి దర్శనం కల్పించే ప్రయత్నం అధికారులు చేశారన్నారు. భక్తులు ఉచిత దర్శనం చేసుకునేందుకు ఐదు కిలోమీటర్ల మేర అప్‌హిల్ బస్టాండ్ లోవతోట మీదుగా 2.6 మీటర్ల వెడల్పాటి బారికేడ్లు, రూ.300 భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా 3.9 కిలోమీటర్ల నీలాద్రి గేటు నుంచి 2.6 మీటర్ల బారికేడ్లు, రూ.1000 భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా 2.4 కిలోమీటర్ల మేర మే ఐ హెల్ప్ యు నుంచి 2.6 మీటర్లు బారికేడ్లు, రూ.1500 వీఐపీలు, వీవీఐపీ భక్తులు దర్శనం చేసుకునేందుకు 0.3 కి.మీ మేర 2.6 మీటర్ల బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 82 శాశ్వత టాయిలెట్స్, 75 మొబైల్ టాయిలెట్స్, కొండ దిగువన మరో 55 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ అర్ధరాత్రి వరకూ ఉచిత అన్న ప్రసాదం అందించామని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చందనోత్సవం సజావుగా జరిగేలా సహకరించిన భక్తులు, స్థానికులు, అధికారులు, సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డా.త్రివిక్రమ్ వర్మ, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా బందోబస్తు
దొండపర్తి: చందనోత్సవం బందోబస్తు తీరుపై పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. చందనోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడం.. సింహాచలం ఘాట్ రోడ్డు సింగిల్ వే కావడంతో రాకపోకల్లో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇందుకు గల కారణాలపై సీపీ విశ్లేషించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే కార్యక్రమాలకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, చేపట్టాల్సిన ప్రణాళికలను వివరించారు. భవిష్యత్తు జరిగే కార్యక్రమాలకు మరింత మెరుగ్గా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ముడసర్లోవ వెహికల్ యార్డ్‌లో మెకానికల్ గ్యారేజీ

- సీతకొండ మలుపు.. వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం
- 28న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఆమోదానికి రానున్న 32 అంశాలు



జీవీఎంసీ కౌన్సిల్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 28న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. కౌన్సిల్ సమావేశంలో 32 అంశాలు పొందుపరిచారు. మరికొన్ని టేబుల్ అంశాలు కౌన్సిల్‌కు రానున్నాయి. వీటిలో ప్రధానంగా..

- జీవీఎంసీ వాహనాల నిర్వహణకు ఎగ్జిక్యూటివ్ అథారిటీ క్షేత్రస్థాయి పరిశీలనలో పీహెచ్ సెక్షన్ వాహనాల సక్రమ నిర్వహణకు జీవీఎంసీకి చెందిన మెకానికల్ గ్యారేజీ లేదని గమనించారు. ఈ నేపథ్యంలో ముడసర్లోవ వెహికల్ యార్డ్‌లో మెకానికల్ గ్యారేజీ నిర్మించనున్నారు. అందుకు కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆమోదానికి చర్చకు రానుంది. ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆదేశాల మేరకు ఆర్టీసీ నుంచి మోడల్ ప్రతిపాదనలతో ప్రాథమిక అంచనాలు తయారు చేశారు. రూ.కోటి 22 లక్షలతో గ్యారెజ్ షెడ్, రూ.11 లక్షలతో 8 గదులు, రూ.15 లక్షలతో మెషినరీ, రూ.4 లక్షలతో ఎలక్ట్రిఫికేషన్, రూ.2.50 లక్షలతో వాటర్ సప్లై, రూ.2.50 లక్షలతో వాటర్ సర్వీసింగ్ ఎక్విప్‌మెంట్, రూ.10 లక్షలతో గ్యాంట్రీ క్రేన్ ఏర్పాటుకై అంచనాలు రూపొందించారు. టెండర్ విధానం ద్వారా రూ.కోటి 98 లక్షలతో ఏర్పాటు చేయనున్న మెకానికల్ గ్యారేజీ పరిపాలనా ఆమోదానికి కౌన్సిల్ ముందుకు రానుంది.
- **సీతకొండ మలుపు.. వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా**

జోన్-2 మధురవాడ పరిధి బీచ్ రోడ్డు అభివృద్ధిలో భాగంగా ప్రస్తుత సీతకొండ మలుపు పాయింట్‌ను జీ-20 సదస్సులో భాగంగా ఇటీవల అభివృద్ధి చేసిన సంగతి విదితమే. సుందరీకరణ చేసిన వ్యూ పాయింట్ ఏరియాను వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేసేందుకు కార్పొరేషన్ ఆమోదానికి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఇచ్చిన ముందస్తు అనుమతిని రాటిఫై చేసేందుకు కౌన్సిల్ ముందుకు రానుంది. అలాగే జోన్-3, 4లో వెండింగ్ జోన్లు గుర్తించి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు కార్పొరేషన్ ఆమోదానికి సభ్యుల ముందుకు రానుంది. బీచ్ రోడ్డు వెంబడి సీ పెరల్ పార్లర్, ఆలీవ్ టర్టల్, ఆర్కే బీచ్ బస్టాప్, పాండురంగాపురం సర్వీస్ రోడ్డు, సివరేజ్ పంప్‌హౌస్ సర్వీస్ రోడ్డు , ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ సర్వీస్ రోడ్డు, అంబికా సీగ్రీన్ హోటల్ సర్వీస్ రోడ్డు, వైఎంసీఏ ఎదురుగా, డిఫెన్స్ క్వార్టర్స్, తెన్నేటి పార్క్ గేటు కుడి వైపున వెండింగ్ జోన్లు ఏర్పాటుకు సంబంధించి చర్చకు రానుంది.

జిల్లా కలెక్టర్ అభ్యర్థన, కార్యనిర్వాహక అధికారి సూచనల మేరకు ఎండాడ సర్వే నెంబరు 118/4లో ఎకరా విస్తీర్ణ భూమిని సొసైటీ టు ఎయిడ్ ది వినికిడి లోపం ఉన్న వారికి అనుకూలంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, హియరింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భూ బదలాయింపుతో పాటు పలు పరిపాలనా అంశాలు చర్చకు రానున్నాయి.

ఎక్కడికక్కడ చలివేంద్రాల ఏర్పాటు

తెల్లవారు నుంచే ఉపాధి పనులు
కలెక్టరేట్ స్పందనకు 190, జీవీఎంసీకి 83, పోలీసు కమిషనరేట్‌కు 64

కలెక్టరేట్, జీవీఎంసీ, పోలీసు కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమాలకు విశేషస్పందన లభించింది. కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో జేసీ విశ్వనాథ్, జీవీఎంసీలో మేయర్ హరివెంకటకుమారి, పోలీసు కమిషనరేట్‌లో పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఫిర్యాదులు స్వీకరించి, మూడు రోజుల్లోగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సాక్షి, విశాఖపట్నం : రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులను తెల్లవారు జామునుంచే చేపట్టేలా కార్మికులకు అవగాహన కల్పించి చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడగాడ్పులు వీస్తున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించే మార్గాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. వడదెబ్బకు గురవుతున్న వారికి ప్రథమ చికిత్స చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోని ఆదేశించారు. వడదెబ్బ బాధితుల కోసం పీహెచ్‌సీలలో ప్రత్యేక బెడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. జీవీఎంసీ, డ్వామా అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పంట నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆర్బీకేల ద్వారా రైతులకు సూచించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని డీఈవోకి సూచించారు. ఈ నెల 26న జిల్లా సమీక్ష కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరగనుందని, సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందన వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని జేసీ విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం జేసీతో పాటు డీఆర్‌వో శ్రీనివాస మూర్తి , డీఎల్‌డీవో పూర్ణిమాదేవి ప్రజల దగ్గర నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో 190 విజ్ఞప్తులు అందాయి. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 87 అర్జీలు రాగా, జీవీఎంసీ 44, పోలీస్ 27, ఇతర విభాగాలకు సంబంధించి 35 విజ్ఞప్తులు అందాయి.

స్పందన అర్జీదారులకు భోజన ఏర్పాట్లు
కలెక్టరేట్‌లో స్పందన కోసం వచ్చే అర్జీదారులు, వారి సహాయకులకోసం వేసవి నేపథ్యంలో మధ్యాహ్న భోజన సదపాయాన్ని జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని జేసీ విశ్వనాథన్ తెలిపారు. ఈ భోజన సౌకర్యాన్ని జేసీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన సీపీ



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 64 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజుతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్



అర్జీదారులకు భోజన ప్యాకెట్స్ అందిస్తున్న జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



ఫిర్యాదు స్వీకరిస్తున్న మేయర్ వెంకటకుమారి

డాబాగార్డెన్స్ : డయల్ యువర్ మేయర్, స్పందనకు వచ్చిన అర్జీలు పరిష్కరించినట్టు తన వద్ద రిపోర్ట్ ఉందని, ఆయా అర్జీదారునితో నేరుగా మాట్లాడతానని, ఏ మాత్రం తేడా ఉంటే అధికారులపై చర్యలు తీసుకుంటానని మేయర్ హరి వెంకటకుమారి హెచ్చరించారు. డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. అర్జీలపై అలసత్వం వహించిన అధికారిపై చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించేది లేదన్నారు. స్పందన కార్యక్రమానికి కొంత మంది అధికారులు రానందున వారి నుంచి వివరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత రెండువారాలు డయల్ యువర్ మేయర్, స్పందనకు వచ్చిన అర్జీలను మేయర్ పరిశీలించారు.

డయల్ యువర్ మేయర్‌కు 20, స్పందనకు 83
డయల్ యువర్ మేయర్‌కు 20 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి 5, అదనపు కమిషనర్ (పబ్లిక్ హెల్త్)కు 2, టౌన్ ప్లానింగ్‌కు 6, డీసీ (రెవెన్యూ)కు 2, సీఎంఓహెచ్‌కు 3, యూసీడీకి 2 ఫిర్యాదులు వచ్చాయి. అలాగే జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో 83 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో జోన్-2కు ఐదు, జోన్-3కి 15, జోన్-4కి 10, జోన్-5కి 11, జోన్-6కి 15, జోన్-7కి ఒకటి, జోన్-8కి 13, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కమిషనర్లు, డాక్టర్ వై శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ప్రధాన సిటీ ప్లానర్ సునీత, డీసీ(రెవెన్యూ) ఫణిరాం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేజీహెచ్‌లో పరికరాల కోసం హెచ్‌పీసీఎల్ వితరణ



ఒప్పంద పత్రాలతో కలెక్టర్ మల్లికార్జున, హెచ్‌పీసీఎల్ అధికారులు

మహారాణిపేట : కేజీహెచ్‌లోని పది విభాగాల్లో పరికరాల కొనుగోలు కోసం హెచ్‌పీసీఎల్ రూ. 2.66 కోట్లు కేటాయించింది. ఈ మేరకు సోమవారం హెచ్‌పీసీఎల్ అధికారులు జిల్లా కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో ఎంవోయూపై సంతకం చేశారు. కేజీహెచ్‌లో మెరుగైన సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించడంపై కలెక్టర్ అభినందనలు తెలిపారు. రోగుల సంరక్షణ, చికిత్స ప్రమాణాల పెంపునకు ఉపయోగపడే పరికరాలు అందించేందుకు హెచ్‌పీసీఎల్ ముందుకు రావడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్, చీఫ్ జనరల్ మేనేజర్ కె.నగేష్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.గోపి పాల్గొన్నారు.

మే 5న బల్క్ ల్యాండ్స్‌కు వేలం

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏకు చెందిన బల్క్ ల్యాండ్స్ విక్రయానికి మే 5వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 25వ తేదీ నుంచి మే 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు రాష్ట్ర ప్రభుత్వ ఈ-ఆక్షన్ పోర్టల్ https://konugolu.ap.gov.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరవాడ మండలం ఎదులపాక బోనంగి గ్రామంలో 4.5 ఎకరాలు, మధురవాడలో 0.64 ఎకరాలు, అదే ప్రాంతంలో 147/పీ సర్వే నెంబర్‌లో 0.832 ఎకరాలు, 1.755 ఎకరాలు, 0.193 ఎకరాలు, అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో 388/1పీ సర్వే నెంబర్‌లో 6 ఎకరాలు, అందులోనే మరో 3.96 ఎకరాలు విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాల కోసం వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్ www.vmrda.gov.inలో గానీ, కొనుగోలు పోర్టల్‌లో హెల్ప్‌డెస్క్ 08645-246370/71/72/73/74కు సంప్రదించాలని సూచించారు.

గాయపడిన కానిస్టేబుల్‌కు సీపీ పరామర్శ



కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు

దొండపర్తి(విశాఖ దక్షిణ): అప్పన్న చందనోత్సవం విధులు నిర్వర్తించడానికి వెళ్లి బస్సు దిగుతూ ప్రమాదానికి గురై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడో పట్టణ కానిస్టేబుల్ జి.జగదీష్‌ను సోమవారం నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు పరామర్శించారు. బస్సు వెనుక చక్రం కానిస్టేబుల్ కుడి కాలుపై నుంచి వెళ్లిపోవడంతో ఆయనకు కాలికి తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సీపీ వెళ్లి అతడి పరిస్థితిని గమనించారు. అందిస్తున్న చికిత్సతో పాటు రికవరీకి ఎంత సమయం పడుతుందన్న విషయంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను, పిల్లలను కలిసి ధైర్యం చెప్పారు. తక్షణ అవసరాల కోసం వారికి నగదును అందజేశారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో సోమవారం రాత్రి బయల్దేరిన విశాఖ-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 25వ తేదీన బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో 25వ తేదీన బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 26వ తేదీన బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

చందనోత్సవంలో టీడీపీ నేతకు చెంపదెబ్బ


సతివాడ శంకరరావును కొడుతున్న మహిళ


దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పోలీసుకు చెబుతున్న మహిళ

సింహాచలం : దురుసుగా ప్రవర్తించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ సతివాడ శంకరరావు చెంపపై ఓ మహిళ చెల్లుమనిపించింది. చందనోత్సవంలో భాగంగా పాత విచారణ కేంద్రం వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆదివారం తెల్లవారుజామున పాత విచారణ కేంద్రం వద్ద ప్రొటోకాల్ వీఐపీలు వెళ్లే గేటు వద్ద ఆ మహిళతో సతివాడ శంకరరావు గొడవపడ్డారు. శంకరావు, ఆమె తల్లితో పాటు క్యూ లైన్‌లో దూసుకొచ్చాడు. ఎంత చెప్పినప్పటికీ వినకపోవడంతో శంకరరావు చెంపపై కొట్టింది. చివరకు పోలీసులు కలగజేసుకుని శంకరరావును అక్కడ నుంచి పంపించేశారు.

అప్పన్నకు తొలివిడత చందనం సమర్పణ


సహస్ర ఘటాభిషేకం కోసం ప్రధాన కలశను శిరస్సుపై తీసుకొస్తున్న ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పాల్గొన్న త్రిదండి చిన జీయర్‌స్వామి

- సోమవారం తెల్లవారుజామున 2 గంటల వరకు నిజరూప దర్శనం
- ఉదయం 9.30 గంటల నుంచి అప్పన్న దర్శనాలు ప్రారంభం
- గుమ్మడి పండు ఆకారంలో ఉన్న స్వామిని దర్శించుకున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం తెల్లవారుజామున తొలివిడత చందనం శాస్త్రోక్తంగా సమర్పించారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులకు అప్పన్న దర్శనభాగ్యం కల్పించారు. తొలివిడత చందన సమర్పణ తర్వాత గుమ్మడిపండు ఆకారంలో ఉండే స్వామివారిని భక్తులు దర్శించుకుని తరించారు. కాగా ఆదివారం చందనోత్సవం సందర్భంగా విశేషంగా భక్తులు తరలిరావడంతో అర్ధరాత్రి తర్వాత కూడా నిజరూప దర్శనం కల్పించారు. ఒక పక్క సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నా... అప్పటికీ క్యూలో వేచి ఉన్న భక్తులకు దర్శనం కల్పించారు. సోమవారం తెల్లవారుజామున రెండు గంటల వరకు భక్తులకు నిజరూప దర్శనాన్ని అందజేశారు. ఈ తరుణంలో సహస్ర ఘటాభిషేకం కూడా పూర్తిచేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితుడు త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు గంగధార నుంచి ప్రధాన కలశతో నీటిని తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. అనంతరం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో తొలివిడతగా మూడు మణుగుల చందనం (120 కిలోలు) సమర్పణ పూర్తి చేశారు. ఉదయం 5గంటలకు పవళింపు సేవ, 6 గంటల సమయంలో సుప్రభాతసేవ నిర్వహించారు. వైదిక కార్యక్రమాలు పూర్తిచేసి ఉదయం 9.30గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ జోనల్ ఇన్‌ఛార్జిల నియామకం


అల్లంపల్లి రాజుబాబు


రెల్ల జానకీరాం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలను నియమించారు. విశాఖ జోనల్ (విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల) విద్యార్థి విభాగం ఇన్‌చార్జిగా రెల్ల జానకీరాం (విశాఖ తూర్పు నియోజకవర్గం)ను, జోనల్ ఎస్సీ విభాగం ఇన్‌ఛార్జిగా అల్లంపల్లి రాజుబాబు (విశాఖ తూర్పు నియోజకవర్గం)ను నియమించారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

మనబడి-మన బాధ్యత..!

- ప్రభుత్వ పాఠశాలల్లో సోషల్ ఆడిట్
- పేరెంట్స్ కమిటీలకు భాగస్వామ్యంతో పనులు
- పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సులు
- 2023-24 విద్యా సంవత్సరానికి యాక్షన్ ప్లాన్
- ఈ నెల 29 నాటికి సమగ్ర నివేదిక సిద్ధం


పెదగంట్యాడలో నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

విశాఖ విద్య: విద్యారంగం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. నాడు-నేడుతో పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది. ఉపాధ్యాయులపై భారం లేకుండా పాఠశాల నిర్వహణకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏటా క్రమం తప్పకుండా నిధులు కేటాయింపు(స్కూల్ గ్రాంట్) చేస్తోంది. విద్యాభివృద్ధిలో భాగంగా పేరెంట్స్ కమిటీల భాగస్వామ్యాన్ని పెంచాలనే ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖాధికారులు రంగంలోకి దిగారు. మన బడి-మన బాధ్యతను గుర్తు చేసేలా 'పాఠశాలల సోషల్ ఆడిట్' పేరిట మరో ప్రయోజనాత్మక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 29 నాటికి జిల్లా స్థాయిలో సమగ్ర నివేదిక సిద్ధం చేసే పనిలో విద్యాశాఖాధికారులు నిమగ్నమయ్యారు.

షెడ్యూల్ ఇలా..

మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులను సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ నెల 27 వరకు జిల్లాలోని 8 మండలాల్లో వీటిని పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇదే సమయంలో పాఠశాల స్థాయిలో పేరెంట్స్ కమిటీ సభ్యులకు కూడా ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. 25న గాజువాక(జెడ్పీ హైస్కూల్ గాజువాక), ఆనందపురం(ఈస్టన్ విశాఖ ఇంగ్లిష్ మీడియం స్కూల్, బోయపాలెం), 26న పెందుర్తి (జెడ్పీ హైస్కూల్ వేపగుంట), భీమునిపట్నం(జెడ్పీ హైస్కూల్ రెండో వార్డు) ,27న చినగదిలి(జెడ్పీ హైస్కూల్ చంద్రంపాలెం, విశాఖపట్నం అర్బన్(జీవీఎంసీ చెంగలరావుపేట, టౌన్ కొత్తరోడ్) మండలాల్లో శిక్షణ నిర్వహిస్తున్నారు.

ఇదీ లక్ష్యం

పేరెంట్స్ కమిటీ బాధ్యతలు, సహిత విద్యపై అవగాహన, విద్యా ప్రమాణాలు, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేలా వారిలో చైతన్యం తీసుకురావటం, నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ, బాలికా విద్యను ప్రోత్సహించటం, బాలికలకు భద్రత కల్పించటం. ఈ మొత్తం కార్యకలాపాల్లో పేరెంట్స్ కమిటీలకు పూర్తి స్థాయిలో భాగస్వామ్యులను చేయనున్నారు.

బడి బలోపేతానికి నిధులు

పాఠశాలల్లో ఇప్పటి వరకు చేపట్టిన కార్యకలాపాలను పరిశీలనతో పాటు, భవిష్యత్‌లో ఏ మేరకు పనులు చేపట్టాలనేది పేరెంట్స్ కమిటీల భాగస్వామ్యంతో సమగ్ర ప్రణాళిక తయారు చేస్తారు. ఇందుకోసమని పాఠశాల స్థాయిలో యూ-డైస్ కోడ్ ఆధారంగా ప్రత్యేక యాప్ ద్వారా ఈ మొత్తం వివరాలను నమోదు చేస్తారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టబోయే కార్యక్రమాలకు ఏ మేరకు నిధులు అవసరమనేది సమగ్ర నివేదిక రూపొందించనున్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించనున్నాయి.

శిక్షణ సక్సెస్ అయ్యేలా..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న శిక్షణ విజయవంతం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మండల స్థాయి, పాఠశాల స్థాయిలో నిర్వహించే శిక్షణకు నూరుశాతం హాజరు ఉండేలా ముందుగానే అందరికీ సమాచారం ఇచ్చాం. భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం.

– సీహెచ్ శిరీష, సీఎంవో, విశాఖ జిల్లా

చాలా మంచి కార్యక్రమం



సాల్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో వినూత్న మైన కార్యక్రమాలను విద్యాశాఖ అమలు చేస్తోంది. వీటిని విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నాం. సోషల్ ఆడిట్ అనేది ఎంతో మంచి కార్యక్రమం.

– జి.వరహాలు దొర, స్టేట్ రిసోర్స్ పర్సన్, విశాఖ జిల్లా

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,710
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,650
వెండి(కిలో):	రూ.80,000

కాలుష్య నియంత్రణపై బాధ్యత లేదా?

జీవీఎంసీ అధికారులు, సిబ్బంది తీరుపై మేయర్ ఆగ్రహం


క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి ఆటోపై వచ్చిన మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రతి సోమవారం తన సొంత వాహనాలను పక్కన పెట్టి, ప్రజా రవాణా ద్వారా జీవీఎంసీకి వస్తున్న సంగతి తెలిసిందే. క్యాంపు కార్యాలయం నుంచి ఆటోపై జీవీఎంసీకి చేరుకున్న మేయర్..జీవీఎంసీ చుట్టూ భారీ స్థాయిలో ఉద్యోగులు, అధికారుల వాహనాలు ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత వాహనాలతో రావొద్దని ఎంత హెచ్చరించినా అధికారులు, సిబ్బందిలో మార్పు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ చుట్టూ ఎటువంటి వాహనాలు కనిపించకూడదని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. వారంలో ఒక రోజు బస్సు, ఆటో, సైకిల్‌పైనే జీవీఎంసీకి ఉద్యోగులు చేరుకోవాలని, అలా కాని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమం అనంతరం మేయర్ తిరిగి ఆటోలో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు.

కేజీహెచ్‌లో ఆధునిక సత్రం రెడీ

నేడు ప్రారంభించనున్న మంత్రి విడదల రజని


కేజీహెచ్‌లో ఆధునిక సత్రంలో రోగుల సహాయకుల కోసం పడకలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులు విశ్రాంతి తీసుకునేందుకు 2013లో నాటి రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి నిధులతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. అయితే కలెక్టర్ మల్లికార్జున స్పందించి ఆ భవనాన్ని ఆధునికీకరించారు. సీఎస్ఆర్ నిధులు, ఇస్కాన్ నిధులతో ఈ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రూ.50లక్షలతో భవనాన్ని అందుబాటులో తీసుకొచ్చారు. దీనికి కేజీహెచ్ ఆధునిక సత్రం అని నామకరణం చేశారు. భవనాన్ని మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని ప్రారంభించనున్నారు. రెండు అంతస్తుల్లో కూడిన ఈ భవనంలో సదుపాయాలు కల్పించారు. నిర్వహణ బాధ్యతను సాగర్‌నగర్‌కు చెందిన ఇస్కాన్ సంస్థకు అప్పగించారు. ఈ భవనాన్ని ఆధునికరించి రోగుల సహాయకులు వినియోగించనున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ డి.ఏ.నాయుడు పర్యవేక్షణలో డీఈఈ మన్మథరావు ఆధ్వర్యంలో భవన ఆధునికీకరణ జరిగింది. విద్యుత్ పనులు, పరుపులు, దోమ తెరలు, మంచినీటి సదుపాయం కల్పించారు. ఇస్కాన్ రూ.20 లక్షలు సాయం చేయగా కలెక్టర్ మల్లికార్జున సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు.

చిన్నారి కడుపులో కణితి తొలగింపు

విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన కేజీహెచ్ వైద్యులు


శస్త్ర చికిత్స అనంతరం చిన్నారితో వైద్యుల బృందం

మహారాణిపేట: రెండు సంవత్సరాల చిన్నారి కాలేయంలోని క్యాన్సర్ కణితిని కేజీహెచ్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఇప్పుడు చిన్నారి ఎంతో ఆరోగ్యంగా ఉందని ఆస్పత్రి పిల్లల సర్జన్ విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... విశాఖ నగరానికి చెందిన రమేష్ కుమార్తె కడుపు నొప్పితో బాధపడడంతో స్థానిక వైద్యులకు చూపించారు. వారు పరీక్షించి కేజీహెచ్‌లో చూపించమని సలహా ఇచ్చారు. దీంతో ఈ నెల 2న కుమార్తె శాన్వితను కేజీహెచ్ పిల్లల సర్జన్ విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు రమేష్ చూపించారు. ఆయన పరీక్షించి శస్త్ర చికిత్స అవసరమని నిర్ధారించారు. అనంతరం ఈ నెల 6న సంక్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించి శాన్విత కాలేయంలో ఉన్న 250 గ్రాముల క్యాన్సర్ కణితిని తొలగించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు భాస్కరరెడ్డి, డాక్టర్ హాసంతి, డాక్టర్ రమణ, డాక్టర్ రాజీవ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నివేదిత, డాక్టర్ మాధురి బృందం సుమారు నాలుగు గంటలపాటు శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఈ నెల 18న డిశ్చార్జి చేసినట్టు తెలిపారు. వైద్యుల బృందాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ అభినందించారు. చిన్నారి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

జగనన్న కాలనీ నిర్మాణాలు వేగవంతం చేయండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు వేగవంతంగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ లే-అవుట్ల స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జగనన్న కాలనీ లే అవుట్ స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 69 లే అవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. ఆయా లేఅవుట్‌ల్లో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదిక అందించాలన్నారు. పనుల నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. కాంట్రాక్టర్‌కు కావల్సిన మౌలిక సదుపాయాలన్నీ సమకూర్చాలని ఆదేశించారు. అలాగే నగరంలో నిర్మిస్తున్న 35 వేల టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలని, ఇప్పటికే పూర్తయిన ఇళ్లకు మ్యాపింగ్, రిజిస్ట్రేషన్, బ్యాంకులోను, తదితర పనులు వేగవంతం చేసి లబ్ధిదారులకు అందించాలని ఏపీడీలను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, డాక్టర్ వి సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికా అధికారి బి సురేష్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు, హార్టికల్చర్ డీడీ ఎం దామోదరరావు, హౌస్ ప్రాజెక్టు డైరెక్టర్, పర్యవేక్షక ఇంజనీర్లు, జోనల్ కమిషనర్లు, ఏసీపీ, డీసీపీలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.117
స్కిన్	: రూ.204
స్కిన్‌లెస్	: రూ.214

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	450.00
విజయనగరం	454.00
శ్రీకాకుళం	454.00

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ క్రూరమైన చర్య

ఉక్కు దీక్షకు మద్దతు తెలిపిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


మాట్లాడుతున్న కేఏ పాల్

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ క్రూరమైన చర్య అని, కార్మికులు లాభాల్లోకి తీసుకొచ్చిన సంస్థను అమ్మాలనుకోవడం మోదీ ప్రభుత్వ కుట్రలో భాగమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సోమవారం 802వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఆయన కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తాను వస్తానని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు సమాచారమిచ్చినా పట్టుమని 100 మంది కూడా లేరని, ఇలా అయితే ఉద్యమాలు ఎలా చేస్తారన్నారు. 32 మంది అమరవీరుల త్యాగం, 16వేల మంది నిర్వాసితుల భూదానంతో ఏర్పడిన అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు పరిశ్రమను విక్రయించాలని చూస్తే సహించమన్నారు. విశాఖ ఉక్కును అమ్మాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికే అమ్మాలని, అందుకోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. అవసరమైతే పీఎం మోదీ ఇల్లును ముట్టడించైనా ప్రైవేటీకరణను ఆపాలన్నారు. నరేంద్రమోదీ, అమిత్‌షాలు మాత్రమే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ప్రైవేటీకరణను ఆపగలరన్నారు. మే 15లోగా భారీ బహిరంగ సభను లక్ష మందితో ఏర్పాటు చేస్తే తాను వస్తానన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

యువకులను కాపాడిన లైఫ్ గార్డ్స్


యువకులను తీరానికి తీసుకుని వచ్చిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో సరదాగా గడిపేందుకు మధురవాడకు చెందిన ఆర్. రమేష్, ఎస్.రోహిత్ సోమవారం సాయంత్రం చేరుకున్నారు. ఇద్దరూ స్నానం చేసేందుకు బీచ్‌లోకి వెళ్లగా కెరటాల ఉధృతిలో చిక్కుకున్నారు. ఇది గమనించిన లైఫ్ గార్డ్స్ వెంటనే బీచ్‌లో దిగి వీరిద్దరిని కాపాడారు. యువకులను కాపాడిన లైఫ్ గార్డ్స్‌ను మెరైన్ ఎస్సై మురళీ కృష్ణ అభినందించారు.